క్లుప్తంగా

ఏయూ పురుషుల క్రికెట్ జట్టు ఎంపిక



క్రీడాకారులతో ఆచార్య విజయ మోహన్

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం పురుషుల క్రికెట్ జట్టు ఎంపిక శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎన్. విజయమోహన్ మాట్లాడుతూ యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్ లో పురుషులు క్రికెట్ పోటీలు ఈ నెల 16 నుంచి 21 వరకు జరుగుతాయన్నారు. ఏయూ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ జట్టుకు 16 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఏయూ క్రికెట్ జట్టు ప్రతిభ సాధించి వర్సిటీకి పేరు తీసుకు రావాలన్నారు. ఏయూ వ్యాయామ విద్యా విభాగం హెడ్ ఆచార్య ఎ. పల్లవి క్రీడాకారులను అభినందించారు ఏయూ దూరవిద్యా కేంద్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దొరబాబు, పీడీ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

మద్దిలపాలెం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మద్దిలపాలెం డాక్టర్ వి.ఎస్. కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆఫీస్ అసిస్టెంట్ వృత్తి నైపుణ్య కోర్సులో రెండు నెలల శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి చాముండేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ అనంతరం వివిధ ప్రైవేట్ సంస్థలలో ఉద్యోగావకాశాలను కల్పిస్తామని తెలియజేశారు. ఆసక్తి గల 18 నుంచి 35 సంవత్సరాల వయసు కలిగిన యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 9885694676 ను సంప్రదించాలని సూచించారు.

సిద్‌శ్రీరామ్ కర్ణాటక కచేరీ నేడు

మద్దిలపాలెం: ప్రముఖ సినీ నేపథ్యగాయకుడు సిద్ శ్రీరామ్ కర్ణాటక కచేరీ శనివారం సిరిపురం వుడా చిల్డ్రన్ థియేటర్‌లో నిర్వహిస్తున్నామని విశాఖ మ్యూజిక్ అకాడమీ ప్రతినిధులు పేర్కొన్నారు. సాయంత్రం 6.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేని పేర్కొన్నారు.

డ్రైనేజీకి మరమ్మతులు



కాలువ మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డులోని పీతానిదిబ్బ ప్రాంతంలో కాలువకు జీవీఎంసీ సిబ్బంది శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ జీవీఎంసీ అధికారులతో మాట్లాడి మరమ్మతులను చేయించారు. ఈ పనులను వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ పల్లా దుర్గారావు పర్యవేక్షించారు.

దివ్యాంగుల పింఛన్ల పరిశీలన



దివ్యాంగుల వివరాలు సేకరిస్తున్న జోనల్ కమిషనర్ శివప్రసాద్

సీతమ్మధార : జీవీఎంసీ జోన్-3 పరిధిలో గల దివ్యాంగుల పింఛన్లను అధికారులు వెరిఫికేషన్ నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తూర్పు, ఉత్తర నియోజకవర్గాల పరిధిలో దివ్యాంగుల పింఛన్ల పరిశీలన జరుగుతోంది. ఈ నేపథ్యంలో తూర్పు నియోజకవర్గం పరిధి 21వ వార్డు చినవాల్తేరు రెల్లివీధిలోని దివ్యాంగ పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి అధికారులు వివరాలు సేకరించారు. జోనల్ కమిషనర్ శివ ప్రసాద్ పర్యవేక్షణలో యూసీడీ సిబ్బంది, కేజీహెచ్ వైద్యులు ఇతర సిబ్బంది పింఛన్ల వెరిఫికేషన్ నిర్వహిస్తున్నారు.

ముక్కోటి వైభవం

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజులు

అంతటా గోవింద నామస్మరణ



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహ స్వామి



కిర్లంపూడి లేఅవుట్‌లోని లలితాపీఠంలో కోదండరామస్వామి




వెటర్నరీ కాలనీలో లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఉత్తర ద్వారం వద్ద భక్తులు

గోవింద నామస్మరణతో వైష్ణవాలయాలు ప్రతిధ్వనించాయి. విశేష అలంకరణలో దేవేరులతో స్వామి దర్శనమిచ్చారు. ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామిని ఉత్తర ద్వారంలో దర్శించుకుని భక్తులు పరవశించారు. స్వామి దర్శనానికి వేలాదిగా భక్తులు ఆలయాల వద్ద బారులు తీరారు. భక్తుల గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. ఇసుకతోట, మద్దిలపాలెం, ఆరిలోవ, ఎంవీపీ కాలనీ, బీచ్ రోడ్డు లోని ఆలయాల్లో పూజలు చేశారు.

– ఏయూ క్యాంపస్/ఎంవీపీ కాలనీ/ఆరిలోవ/మద్దిలపాలెం



విశేష అలంకరణలో ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి



ఎంవీపీ సెక్టార్-6లోని ఆలయంలో వెండి ఆభరణాల అలంకరణలో దేవేరులతో వేంకటేశ్వర స్వామి



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీ, పద్మావతి సమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు



ప్రసాదాలు నివేదన చేస్తున్న మహిళలు

రేపటి నుంచి ఏయూ మైదానంలో సంక్రాంతి సంబరాలు

విశాఖ విద్య: ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ మైదానంలో ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు రాజ్యసభ మాజీ సభ్యుడు జి.వి.ఎల్.నరసింహారావు తెలిపారు. ఏయూ గ్రౌండ్‌లో జీవీఎల్ మహా సంక్రాంతి సంబరాల ప్రారంభోత్సవానికి శుక్రవారం ఆయన శాస్త్రోక్తంగా పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎల్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ విశిష్టతను చాటిచెప్పేందుకే ముగ్గుల పోటీలు, కోలాట ప్రదర్శన పోటీలు, భోగి మంటలు, పతంగుల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ సాయంత్రం వేళలో సినీ కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం సైబర్ నేరాలు పెరుగుతున్నందున.. రిజర్వ్ బ్యాంకు ప్రతినిధులతో అవగాహన కల్పించేలా వేదిక వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. విశాఖ నగర వాసులంతా కుటుంబాల సమేతంగా సంక్రాంతి సంబరాల్లో పాల్గొనాలని ఆయన కోరారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జీవీఎల్ తదితరులు

అలరించిన నృత్యప్రదర్శనలు

ఏయూక్యాంపస్: బీచ్‌రోడ్డులోని శ్రీ పాండురంగ స్వామి దేవస్థానం ఆవరణలో నాట్యం స్కూల్ ఆఫ్ కూచిపూడి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం శుక్రవారం సాయంత్రం ప్రదర్శించిన వైకుంఠ వైభవోత్సవం అలరించింది. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని పారిశ్రామికవేత్త కె.కుమార్ రాజ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మట్టపల్లి హనుమంతరావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ భారతీయ కళలు, సంస్కృతిని సంరక్షించే వారసులుగా చిన్నారులు నిలుస్తున్నారన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీవెంకటేశ్వర కల్యాణం నృత్య రూపకం, శ్రీ గోదాదేవి వైభవం ప్రదర్శించి అందరి మనసులను ఆకట్టుకున్నారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా కళాకారులకు ప్రశంసాపత్రాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధ్యాత్మికవేత్త ఎం.వి రాజశేఖర్, ఆలయ మేనేజర్ ఎ.దేవుళ్లు, నాట్య గురువు భానురేఖ తదితరులు పాల్గొన్నారు.



నృత్యాభినయం చేస్తున్న చిన్నారులు

సందడిగా సంక్రాంతి సంబరాలు

- విద్యాలయాల్లో ఘనంగా వేడుకలు



సంక్రాంతి వేడుకల్లో ఆచార్యులు, సిబ్బంది

విశాఖ విద్య: సంక్రాంతి సంబరాలను నియోజకవర్గంలోని విద్యాలయాల్లో కనులపండువగా నిర్వహించారు. ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన వేడుకల్లో కాలేజీ ఆచార్యులు, సిబ్బంది రంగవల్లులను తీర్చిదిద్దారు. అనంతరం భోగి మంటలు వేశారు. హరిదాసుల సంకీర్తనలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రాంగణంలో పండగ శోభ ఉట్టిపడింది. కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్ రాజు, ఆచార్యులు, విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో హాజరయ్యారు.

వెంకోజీపాలెం పాఠశాలలో..

మద్దిలపాలెం: సంక్రాంతి సంబరాలను పాత వెంకోజీపాలెంలో జీవీఎంసీ స్కూల్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంబరాలలో భాగంగా చిన్నారులకు రంగవల్లుల పోటీలను నిర్వహించారు. భోగిమంటలు వేసి సందడి చేశారు. గొబ్బెమ్మలు ముచ్చట గొలిపాయి. చిన్నారులు గాలిపటాలు ఎగరవేశారు. సంప్రదాయ గీతాలకు ఉత్సాహంగా నృత్యాలు చేశారు.



జీవీఎంసీ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు

ఎంవీపీ కాలనీలో..

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్-10లోని సమత డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. రంగవల్లికలతో కళాశాల ఆవరణను తీర్చిదిద్దారు. ఈ వేడుకల్లో విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొన్నారు. భారీ భోగి మంట వేసి, నృత్యాలు చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ విజయ రవీంద్ర, కళాశాల డైరెక్టర్ శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.



సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు

తిరుపతి మరణాలు ప్రభుత్వ నిర్యక్ష్యానికి పరాకాష్ట

ఏయూక్యాంపస్: తిరుమల తిరుపతి పుణ్య క్షేత్రంలో జరిగిన తొక్కిసలాట ఘటనకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ బాధ్యత వహించాలని ఆంధ్రప్రదేశ్ వెలమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు అన్నారు. బీచ్‌రోడ్డులోని హోటల్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇది ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తోందన్నారు. మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు పరిహారం ఇప్పించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ దుర్ఘటనకు రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ చైర్మన్ బాధ్యత వహించాలన్నారు. లక్షలాది మంది భక్తులు వస్తారని తెలిసినా సరైన ఏర్పాట్లు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఈ సంఘటనపై విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తితో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పెదిరెడ్ల సత్యం, బర్ల పైడంనాయుడు, పెదిరెడ్ల శ్రీనివాస్, రెడ్డి ఈశ్వర రావు, జి.మన్మథరావు, వదురు రాజ్‌కుమార్, జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లగుడు గోవిందరావు

జోన్-3 కార్యాలయంలో 31 సీసీ కెమెరాల ఏర్పాటు

సీతమ్మధార : నగరంలోని ఆశీలమెట్ట అశోక్‌నగర్‌లో గల జీవీఎంసీ జోన్-3 కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలను జోనల్ కమిషనర్ శివప్రసద్ శుక్రవారం పరిశీలించారు. కార్యాలయంలోని జీ+2 అంతస్తులలో పలు విభాగాలు ఉన్నాయి. రెవెన్యూ విభాగం, ప్రజారోగ్యశాఖ, ఓటర్ల నమోదు విభాగం, జోనల్ కమిషనర్, మలేరియా విభాగం, సౌకర్యం, యూసీడీ విభాగం, వీధిలైట్ల విభాగం, పబ్లిక్ వర్క్స్ తదితర విభాగాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం 31 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని జోనల్ కమిషనర్ శివ ప్రసాద్ శుక్రవారం తెలిపారు.

నుయ్యి స్థలం ఇప్పించాలని ఎమ్మెల్యేకు వినతి

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డులోని పాత వెంకోజీపాలెం గ్రామంలో గల సీతారామ సేవా సంఘానికి సంబంధించిన పెద్ద నుయ్యి, దానికి అనుకుని ఉన్న రెండు సెంట్లు స్థలాన్ని సంఘానికి ఇప్పించాలని గ్రామస్తులు ఎమ్మెల్యే వెలగపూడిని శుక్రవారం కలిసి కోరారు. ఈ స్థలంపై గతంలో వివాదాలు జరగడంతో గ్రీవెన్స్‌లో పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని వివరించారు. దీంతో తహసీల్దారు ఈ స్థలంలో రెండు సెంట్లు గ్రామ సేవా సంఘానికి ఇవ్వాలని సూచించారని తెలిపారు. ఆ స్థలాన్ని ఇప్పించాలని గ్రామస్తులు కోరారు. దీనిపై జీవీఎంసీ జోనల్ కమిషనర్‌కు ఈ స్థలం సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే కోరారు. దీంతో జోనల్ కమిషనర్‌ను గ్రామస్తులు కలిసి సమస్య వివరించారు. పండగ అనంతరం ఈ సమస్య పై విచారణ చేస్తామని కమిషనర్ గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం నాయకులు పరదేశి నాయుడు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్ట్

బీచ్‌రోడ్డు: బాలికను ప్రేమించి మోసం చేసిన యువకుడిని పోక్సో కేసులో మూడో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలివీ.. చిన్నవాల్తేరు రెల్లి వీధికి చెందిన ఆటోడ్రైవర్ బాలికను ప్రేమ పేరుతో మోసం చేశాడు. దీనిపై బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ యువకుడిని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

తాబేళ్ల రక్షణపై అవగాహన

మహారాణిపేట: తాబేళ్ల సంరక్షణకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం ఫిషింగ్ హార్బర్‌లో నెట్ ఫిష్ ఆధ్వర్యంలో మత్స్యకారులతో అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కాలంలో తీర ప్రాంతానికి గుడ్లు పెట్టడానికి వచ్చి తాబేళ్లు మృతి చెందుతున్నాయన్నారు. ప్రతి బోటు, మరపడవల యాజమానులు వేటాడే బోట్లకు తప్పని సరిగా టెడ్ పరికరాన్ని వాడాలన్నారు. ఆలివ్‌రిడ్లే జాతికి చెందిన తాబేళ్లు తీర ప్రాంతానికి గుడ్లు పెట్టడానికి ప్రతి ఏడాది నవంబర్-ఫిబ్రవరి నెలల మధ్య కాలంలో వస్తాయని, చేపలు వేటాడే వలల్లో చిక్కుకొని ప్లాస్టిక్, సముద్ర కాలుష్యం కారణంగా మృతి చెందుతున్నాయన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని మత్స్యశాఖ, ఏంపెడ, అటవీ శాఖ, మెరైన్ పోలీసులు ఆధ్వర్యంలో హార్బర్ తీర ప్రాంతాల్లో అవగాహన కలిగించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఆశా జ్యోతి, నెట్ ఫిట్ కో ఆర్డినేటర్ హనుమంతరావు, ఏపీ కోస్టల్ మరబోట్లు సంఘం అధ్యక్షుడు బి.కొండబాబు, ఇతర నాయకులు,మత్స్యకారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మత్స్యశాఖ జేడీ లక్ష్మణరావు

మైదాన ప్రాంతానికి బదిలీ చేయాలి

- డీఈవోకు ఎంటీఎస్ ఉపాధ్యాయుల విజ్ఞప్తి

విశాఖ విద్య: ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న 1998 డీఎస్సీకి చెందిన ఎంటీఎస్ టీచర్లను మైదాన ప్రాంతాలకు బదిలీపై తీసుకురావాలని ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం డీఈవో కార్యాలయం ముందు నిరసన తెలిపి, అనంతరం డీఈవో ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. 1998 డీఎస్సీ ద్వారా ఎంపికై, గత విద్యా సంవత్సరం ఏప్రిల్‌లో నియమితులైన తమకు ఏజెన్సీ ప్రాంతాల్లో పోస్టింగ్ ఇచ్చినట్లు తెలిపారు. దీని వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని డీఈవోకు వివరించారు. తమను సొంత మండలాల సమీపానికి బదిలీ చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.



డీఈవో కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న ఎంటీఎస్ ఉపాధ్యాయులు

రహదారుణం

- పదో వార్డులో అధ్వానంగా రహదారులు
- రాకపోకలకు స్థానికుల అవస్థలు



ఇందిరానగర్‌లో గోతులు పడిన సీసీ రోడ్లు



వెటర్నరీ కాలనీలో శిథిలమైన రోడ్డు

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు పరిధిలో పలుచోట్ల రోడ్లు శిథిలావస్థకు చేరాయి. వార్డు పరిధి ఇందిరానగర్ ప్రాంతంలో మరింత శిథిలమై స్థానికుల రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. ఇందిరానగర్‌ను ఆనుకొని ఉన్న రాజీవ్‌నగర్, వెటర్నరీ కాలనీలలోనూ ఇదే పరిస్థితి. జాతీయ రహదారిని ఆనుకొని వెటర్నరీ కాలనీలో లక్ష్మీనారాయణ స్వామి ఆలయం నుంచి కాలనీలో అన్ని వీధుల్లో బీటీ రోడ్లు గోతులు పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఇక్కడ రోడ్లు రాళ్లు తేలిపోయాయి. మధ్యమధ్యలో గోతులు పడటంతో స్థానికులు నడవలేని పరిస్థితి నెలకొంది.

రాజీవ్‌నగర్‌లోనూ ఇదే పరిస్థితి

రాజీవ్‌నగర్‌లో రోడ్లు కొన్నిచోట్ల పెద్ద గోతులు పడ్డాయి. జాతీయరహదారి నుంచి ఈ కాలనీకి ప్రవేశం వద్ద పెద్ద గొయ్యి ప్రమాదకరంగా మారింది. అక్కడే స్పీడ్ బ్రేకర్ ఉండటం, దాని పక్కనే ఏర్పడిన పెద్ద గొయ్యితో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు.

ఇందిరానగర్‌లో శిథిలావస్థలో..

ఇందిరానగర్ కాలనీలో సీసీ రోడ్లు పలు వీధుల్లో శిథిలమయ్యాయి. రోడ్లు పెచ్చులు ఊడిపోయి వాహన రాకపోకలకు ఆటంకంగా మారాయి. ఇదే కాలనీలో రామాలయం పక్క వీధిలో సన్నని సీసీ రోడ్డు మధ్యలో కొన్నాళ్ల క్రితం జీవీఎంసీ యూజీడీ పనులు చేపట్టింది. ఆ పనులలో భాగంగా రోడ్డు మధ్యలో మ్యాన్ హోల్స్ ఏర్పాటు చేసింది. ఆ మ్యాన్ హోల్స్‌పై కట్టిన దిమ్మలు రోడ్డుకు సుమారు అడుగు ఎత్తులో ఉన్నాయి. దీంతో ఈ రోడ్డులో వాహనాలు వెళ్లే వీలు లేకుండాపోయింది.

పట్టించుకోని నాయకులు, అధికారులు

కాలనీలలో శిథిలమైన రోడ్లపై జీవీఎంసీ అధికారులు, స్థానిక వార్డు కార్పొరేటర్‌కు పలుసార్లు విన్నవించినా పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబుకు సైతం ఇటీవల వినతిపత్రం అందించామని తెలిపారు. ఆయన దీనిపై జీవీఎంసీ అధికారులతో మాట్లాడతానని చెప్పి పట్టించుకోలేదని నిరాశ చెందుతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి ఇక్కడ రోడ్లకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.



ఇందిరానగర్‌లో ఇరుకు రోడ్డు మధ్యలో ఎత్తుగా మ్యాన్ హోల్ దిమ్మలు



రాజీవ్‌నగర్‌లో గోతుల రహదారి

సామాజిక కల్యాణ మండపం ప్రారంభం



ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ముప్పల లక్ష్మి సురేష్

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 20వ వార్డులోని శివాజీపాలెం శ్రీకృష్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఎంవీవీ సత్యనారాయణ, ముప్పల సురేష్ సహకారంతో చిన్న పోలమాంబ అమ్మవారి ఆలయం వెనుక నిర్మించిన దేవకి నందన గీత సామాజిక కళ్యాణ మండపాన్ని శుక్రవారం వార్డు కార్పొరేటర్ ముప్పల లక్ష్మి సురేష్ ప్రారంభించారు. ఈ భవన నిర్మాణం కోసం మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ రూ.7 లక్షలు వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు ముప్పల సురేష్ రూ.5 లక్షలు ఆర్థిక సహాయం చేశారు. ఈ మండపం ప్రారంభోత్సవంపై స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో 22వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పీతల గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

'మీ చేతగానితనాన్ని ఇతరులపై నెట్టేస్తారా?'

- జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



మహారాణిపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి రాష్ట్రంలో ఏం జరిగినా.. గత ప్రభుత్వ నిర్లక్ష్యమేనని అనడం వారి చేతగానితనానికి నిదర్శనమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలైనా పాలన మీద గానీ, వ్యవస్థల మీద గానీ పట్టు సంపాదించలేకపోయారన్నారు. రాష్ట్రంలో ఎక్కడ ఏ తప్పిదం జరిగినా గత ప్రభుత్వం మీదకు నెట్టేస్తూ కాలక్షేపం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతిలో జరిగిన ప్రమాదం దురదృష్టకరమని, ఇది కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే జరిగిందని ఆమె ఆరోపించారు. ఈ ప్రమాదంలో విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెందిన నలుగురు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. 2,500 మందికే కనీస ఏర్పాట్లు చేయలేక ప్రభుత్వం చేతులెత్తేసి.. భక్తుల పట్ల తీవ్రనిర్లక్ష్యం చూపిందని మండిపడ్డారు. వైకుంఠ ఏకాదశికి వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు వస్తారన్న విషయం ప్రభుత్వానికి తెలిసినా.. ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించిందో సీఎం, డిప్యూటీ సీఎం సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. 'మా ప్రాణాలు పోతున్నాయి. అంబులెన్స్ సదుపాయం కల్పించండి' అని తొక్కిసలాటకు గురైన భక్తులు ప్రాధేయపడినా అధికారులు స్పందించలేదన్నారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.